సాక్షి అనంతపురం

శనివారం । 8 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.27 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.27 వేలు పలికాయి. మార్కెట్‌కు 481 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.10
కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.5.50 పలికింది.

గరిష్టం/కనిష్టం
40.7°/ 23.2°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత కొనసాగుతోంది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
ఇఫ్తార్	సహరి
6.34	4.52

న్యూస్‌రీల్

తేనెటీగల దాడిలో మహిళలకు గాయాలు



గాయపడిన మహిళా కూలీలు

గుత్తి: తేనెటీగల దాడిలో నలుగురు మహిళా కూలీలు గాయపడ్డారు. పెద్దవడుగూరు మండలం జి.వెంకటాంపల్లిలో పలువురు కూలీలు పత్తి చేనులో పనులు చేస్తున్నారు. ఉన్నపళంగా పెద్ద తేనెటీగల గుంపు కూలీలపై దాడిచేసింది. ఈ ఘటనలో కూలీలు వరలక్ష్మి, నాగలక్ష్మి, నారాయణమ్మ, లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



లారీ చక్రాల కింద మంజునాథ్‌రెడ్డి మృతదేహం

కనగానపల్లి: మండల పరిధిలోని దాదులూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురంలోని విద్యుత్ నగర్‌కు చెందిన మంజునాథ్‌రెడ్డి (26) బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. వారంతంలో వరుసగా సెలవులో రావటంతో శుక్రవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై బెంగళూరు నుంచి అనంతపురం బయలుదేరాడు. దాదులూరు వద్ద జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని ఓవరు టేక్ చేయబోయి అదుపు తప్పి లారీ చక్రాల కింద పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మంజునాథ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కనగానపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు ఆరా తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు.

కూడేరు సమీపంలో పారిశ్రామిక పార్క్!

- అనుమతులు రాగానే పనులు ప్రారంభం

అనంతపురం టౌన్: పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ చేపట్టింది. అందులో భాగంగానే చిన్న, మధ్య తరహా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ఇండస్ట్రియల్ పార్క్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాప్తాడు, ఆర్ అనంతపురం, కొటిపి, పుట్టపర్తి మండలం కప్పలబండ గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్‌లను నెలకొల్పింది. తాజాగా కూడేరు మండలం అరవకూరు సమీపంలో 400 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్‌ను నెలకొల్పనున్నారు. అవసరమైన స్థల సేకరణను సైతం చకచకా చేపడుతోంది. కూడేరు మండల కేంద్రానికి దగ్గరలో బళ్లారి జాతీయ రహదారి పక్కనే పార్క్ ఏర్పాటు చేయనున్నారు. దీంతోపాటు గుత్తి-గుంతకల్లు మధ్యలో మరో పారిశ్రామిక పార్క్ ఏర్పాటు కోసం భూమిని గుర్తించేందుకు ఏపీఐఐసీ అధికారులు నిమగ్నమైనారు. ఈ విషయంపై ఏపీఐఐసీ మేనేజర్ మల్లికార్జునను వివరణ కోరగా కూడేరు మండల పరిధిలో ఇండస్ట్రియల్ పార్క్ కోసం 400 ఎకరాల భూమిని గుర్తించి నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

ఇంటింటా సంక్షేమ కాంతులు

- ప్రభుత్వంపై అపారమైన విశ్వాసం
- అట్టహాసంగా 'జగనన్నే మా భవిష్యత్తు'
- జగన్ పాలనకు జై కొట్టిన జిల్లా ప్రజలు



కళ్యాణదుర్గం మండలం శీబావి గ్రామంలో జగన్ పాలనపై మహిళ అభిప్రాయం నమోదు చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



రాయదుర్గంలో ప్రజల మద్దతు కోరుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

అనంతపురం క్రైం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అపారమైన విశ్వాసం వ్యక్తమైంది. ఇదివరకెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ ఫలాలు, ప్రభుత్వ సేవలు అర్హుల చెంతకే చేరాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం కలిగి ఉంటే మరోమారు ఆశీర్వదించాలని కోరేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం శుక్రవారం జిల్లాలో అట్టహాసంగా ప్రారంభమైంది. పార్టీ ప్రజాప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి, రాప్తాడు, శింగనమల, ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లో కదం తొక్కారు. 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను లబ్ధిదారుల ఇళ్లకు అతికించారు. కళ్యాణదుర్గం మండలం శీబావి గ్రామంలో జరిగిన కార్యక్రమాన్ని మంత్రి ఉషశ్రీ చరణ్ ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా ఏ విధంగా లబ్ధి జరిగిందని ఆరా తీయగా అందరూ సంతృప్తికరమైన సమాధానమిచ్చారు. గత ప్రభుత్వం కంటే భిన్నంగా వైఎస్సార్‌సీపీ పాలనలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలొస్తున్నాయని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. మంత్రి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకుంటే తమ భవిష్యత్తు మరింత బాగుంటుందని, మరింత మేలు జరుగుతుందని ప్రజల నుంచి స్పందన వస్తోందన్నారు.

- అనంతపురంలోని 24వ డివిజన్ నవోదయ కాలనీలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత టీడీపీ పాలన, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన గురించి వివరించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇళ్ల వద్దకే సంక్షేమాన్ని జగన్ ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు ఉన్నారు.
- బుక్కరాయసముద్రం మండలం పాడరాళ్లలో శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కార్యక్రమాన్ని ప్రారంభించి.. లబ్ధిదారులతో మమేకమయ్యారు. 'ప్రజా మద్దతు' పుస్తకంలోని ఐదు ప్రశ్నలను చదివి విన్పించారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల సిఫార్సులతోనే పథకాలందే పరిస్థితి ఉండేదని, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పథకాలందుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు.
- గుంతకల్లులోని 24వ వార్డులో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రారంభించారు. అందరి భవిష్యత్తు కోసం జగన్‌ను మరోసారి సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం సంక్షేమ పథకాల అమలుపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు.
- తాడిపత్రి పట్టణంలోని 30వ వార్డు భగత్‌సింగ్ నగర్‌లో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కార్యక్రమం చేపట్టారు. నాలుగేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ నియంతృత్వ పాలనపై మండిపడ్డారు.
- ఉరవకొండలోని డ్రైవర్స్ కాలనీ, విడపనకల్లులో జరిగిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఏ ప్రభుత్వమూ చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలందించడం వల్లే.. ధైర్యంగా వారి ముందుకెళ్తున్నామన్నారు. గతంలో టీడీపీ నాయకులు ఏనాడూ ప్రజల ముందుకు వచ్చిన పాపాన పోలేదన్నారు.
- రాప్తాడు నియోజకవర్గంలోని అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. టీడీపీ నయవంచక పాలనను గుర్తు చేస్తూనే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరుగుతున్న మేలును వివరించారు. టీడీపీ పాలనలో చంద్రబాబు నాయుడు బడుగు, బలహీన వర్గాలను మోసం చేశాడన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు పాల్గొన్నారు.
- రాయదుర్గం పట్టణంలోని 17వ వార్డులో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు.



అనంతపురంలో ప్రభుత్వ పాలనపై మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



గుంతకల్లులో జగన్ పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



విడపనకల్లులో 'మా నమ్మకం నువ్వే జగన్' అంటున్న ముస్లిం మహిళలతో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో 'జగనన్నే మా భవిష్యత్తు'లో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



బుక్కరాయసముద్రంలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



తాడిపత్రిలో 'మా నమ్మకం నువ్వే జగన్' కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

బాలయ్య మాటలు అర్థరహితం

- వైఎస్సార్‌సీసీ జిల్లా అధ్యక్షుడు 'పైలా'



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: మందు పడితే కానీ నోట మాటరాని హిందూపురం ఎమ్మెల్యే బాలయ్య తమతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని చేసిన వ్యాఖ్యలు అర్థరహితంగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య విమర్శించారు. శుక్రవారం గార్లదిన్నె మండలం మర్తాడులో లోకేష్ యువగళం పాదయాత్రలో బాలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను పైలా ఖండించారు. పేదలు సంతోషంగా జీవించాలని వివిధ సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెడితే.. ఉచిత పథకాల వల్ల రాష్ట్రంలో ఆర్థిక మాంద్యం ఏర్పడిందని బాలయ్య మాట్లాడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పోలీసు శాఖకు ఫ్రీ హ్యాండ్ ఇవ్వడంతో గత ప్రభుత్వం కంటే భిన్నంగా ఫ్యాక్షన్, అక్రమాలు, దౌర్జన్యాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకున్నారన్నారు. మహిళల రక్షణ కోసం 'దిశ' పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ముందుకెళ్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు. మీ నాన్న ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి, మీ అన్న హరికృష్ణను రాజకీయంగా ఎదగనివ్వని, నీకు కనీసం మంత్రి పదవి కూడా ఇవ్వని చంద్రబాబు మోచేతి నీళ్లు తాగుతున్నావంటూ బాలయ్యపై మండిపడ్డారు. సీఎం జగన్ అనుకుని ఉంటే మీ 23 మంది ఎమ్మెల్యేలనూ తీసుకుని, టీడీపీకి ప్రతిపక్ష హోదా లేకుండా చేయడం ఎంతపని అని ప్రశ్నించారు. కానీ వైఎస్సార్‌సీపీ విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ ముందుకెళ్తోందన్నారు. నయవంచక రాజకీయాలు చేసే టీడీపీని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇకనైనా చౌకబారు ఆరోపణలు మానుకోవాలని బాలయ్యకు హితవు పలికారు.

లోక రక్షకుడు ఏసు



అనంతపురం రామచంద్రనగర్ చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

సర్వమానవుల పాప పరిహారార్థం సిలువనెక్కిన ఏసు త్యాగాన్ని గుర్తుచేసుకుంటూ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా చర్చిల్లో శుభ శుక్రవారం ప్రార్థనలు జరిగాయి. ఆయా చర్చిల ఆవరణల్లో సిలువ ఘట్టాలను ప్రదర్శించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

దేవుడా.. ఇదెక్కడి ఘోరమయ్యా

ఇంటి యజమాని చెప్పిన పని చేసుకుని త్వరగా వస్తానన్న భర్త ఎంతకూ తిరిగి రాలేదు. ఫోన్ చేస్తుంటే రెండు గంటలైనా ఎత్తలేదు. తర్వాత కొద్దిసేపటికి యజమాని కొడుకు ఆందోళనగా రాగా.. 'నా భర్త ఏమయ్యాడు సార్.. ఎక్కడున్నాడు?' అని ఆందోళనగా అడిగింది. పేలుడు ఘటనలో చనిపోయాడని చెప్పగానే.. ఇంటి యజమాని కాళ్లు పట్టుకుని 'నా భర్తను తెచ్చివ్వండి' అంటూ బోరున విలపించింది. కడసారి చూసేందుకూ అవకాశం లేకుండా శరీరం ఛిద్రమై ముక్కలు ముక్కలయ్యిందని తెలిసి గుండెలవిసేలా రోదించింది. దేవుడా.. ఇదెక్కడి ఘోరమయ్యా అంటూ కన్నీటి పర్యంతమైంది. అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ హృదయ విదారకర ఘటన జరిగింది.



సంఘటన స్థలంలో రోదిస్తున్న సతీష్ భార్య నవ్య



పేలుడు సంభవించిన ప్రాంతం.. అక్కడే పడివున్న కెమికల్ డ్రమ్ములు



పేలుడు సమయంలో అదే ఆవరణలో వుడ్ వర్క్ చేస్తున్న యూపీ యువకులు వీరే

- కెమికల్‌తో భారీ విస్ఫోటం
- గాల్లోకి ఎగిరి ఛిద్రమైన యువకుడి శరీరం
- సంఘటన స్థలంలో స్పృహ కోల్పోయిన భార్య
- తన భర్తను తెచ్చివ్వాలంటూ రోదించిన వైనం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: గార్లదిన్నె మండలం కోటంక గ్రామానికి చెందిన చాకలి సతీష్ (34), నవ్య దంపతులు అనంతపురం హౌసింగ్‌బోర్డులోని కేకే పెయింట్స్ యజమాని ఇస్మాయిల్‌కు చెందిన అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్, ఇంటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు లక్ష్మీకుమార్, మహేష్ ఉన్నారు. ఆర్టీఏ కార్యాలయ సమీపంలో గల పెయింట్స్ తయారీ పరిశ్రమను ఇస్మాయిల్ పదేళ్ల క్రితమే మూసేశారు. అయితే అందులో కెమికల్స్ డ్రమ్ములు అలాగే ఉన్నాయి. ముందు భాగంలో డైనింగ్, డ్రెస్సింగ్ టేబుళ్ల తయారు చేసే పరిశ్రమ నడుపుతున్నారు. మూసేసిన పెయింట్ పరిశ్రమ షెడ్లను అద్దెకు తీసుకునేందుకు నాలుగు రోజుల క్రితం ఎవరో వచ్చారు. వారి కోసం షెడ్లను శుభ్రం చేయించి.. కెమికల్ డ్రమ్ములను ఇస్మాయిల్ బయట పెట్టించారు. కెమికల్‌ను కాలువలోకి పారబోసి.. డబ్బాలను గుజిరీకి వేసుకుని డబ్బు నువ్వే తీసుకో అని చాకలి సతీష్‌కు చెప్పాడు. ఎంతో కొంత డబ్బు వస్తుందన్న ఆశతో సతీష్ శుక్రవారం మధ్యాహ్నం షెడ్డు వద్దకు వచ్చి ఒక డ్రమ్ము మూత తీస్తుండగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. సతీష్ గాల్లోకి ఎగిరి శరీరం ఛిద్రమైంది. మాంసపు ముద్దలు చెల్లాచెదురుగా ఆ ప్రాంతమంతా పడటంతో భయానక వాతావరణం నెలకొంది. పేలుడు సమయంలో అదే ఆవరణలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐదుగురు యువకులు ఒక గదిలోనే ఉండి వుడ్‌వర్క్ చేస్తుండటంతో ప్రాణాలతో బయటపడ్డారు. అయితే వీరిలో దీపక్ అనే కార్మికుడికి స్వల్ప గాయాలయ్యాయి. త్వరగా వస్తానని చెప్పి వెళ్లిన భర్త ఎంతకూ రాకపోవడంతో భార్య నవ్య ఫోన్ చేసింది. అయితే భర్త ఫోన్ తీయలేదు. రెండు గంటల తర్వాత ఇంటి యజమాని కుమారుడు ఆందోళనగా ఇంటికి వచ్చాడు. 'ఏమైంది సార్?' అని అడిగిన నవ్యకు జరిగిన విషయం చెప్పాడు. కడసారి చూపు చూద్దామని వెళ్తే.. భర్త శరీరం తునాతునకలైపోయి ఉండటం చూసి స్పృహ తప్పి పడిపోయింది. కొద్ది సేపటి తర్వాత కోలుకుని గుండెలు బాదుకుంటూ విలపించింది. ఆమెను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. చివరకు పోలీసులు ఆమెను స్టేషన్‌కు తీసుకెళ్లి ఓదార్చాల్సి వచ్చింది.

నెత్తురోడిన నోట్లనూ వదల్లేదు!

ఇళ్లల్లో పాచిపని చేసి భార్య (నవ్య), వాచ్‌మెన్‌గా, నాలుగిళ్లల్లో బట్టలు ఉతికి ఇస్త్రీ చేసి భర్త (సతీష్) రూ.30వేల దాకా పోగేశారు. ఈ మొత్తాన్ని సతీష్ జేబులో పెట్టుకుని డ్రమ్ములు గుజిరీకి వేసి వద్దామని వెళ్లాడు. ఊహించని విధంగా కెమికల్ విస్ఫోటనంలో మృతి చెందగా.. నెత్తురోడిన నోట్లు చెల్లాచెదురుగా పడ్డాయి. అటువైపు వచ్చిన కొందరు వాటిని తీసుకెళ్లిపోయారు. మానవత్వం మరచిన మనుషులను చూసి ఓ వృద్ధురాలు 'ఏం బతుకులురా మీవి' అంటూ నిట్టూర్చారు.

ఆధారాల కోసం అన్వేషణ..

సమాచారం అందగానే వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌లను రంగంలోకి దింపారు. పేలుడుకు సరైన కారణాలు తెలియరాలేదని, ఘటనా స్థలిలోని నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపుతామని వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి తెలిపారు. అనుమతి లేకుండా హానికరమైన కెమికల్స్‌ను నిల్వ ఉంచిన యజమానిపై కూడా కేసు నమోదు చేస్తున్నామన్నారు. మృతుడు సతీష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చాలా ఏళ్లుగా కెమికల్‌ను వాడకుండా వదిలేసినందువల్ల రియాక్షన్ జరిగి పేలుడు సంభవించి ఉండొచ్చని లేదా మూత తీసే సమయంలో ఎవరైనా బీడీ, సిగరెట్ తాగుతున్నా కెమికల్ గ్యాస్ రిలీజ్ అయ్యి పేలే అవకాశం ఉందని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి





మృతిచెందిన శ్రీనివాసులరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి

నల్లచెరువు/తనకల్లు: నల్లచెరువు మండలం ఎర్రగుంటపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాసులరెడ్డి (43), చంద్రశేఖర్‌రెడ్డి (42) అనే ఇద్దరు వ్యక్తులు చనిపోయారు. పోలీసుల వివరాల మేరకు.. తనకల్లు మండలం కనసానివారిపల్లికి చెందిన శ్రీనివాసులరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మారెమ్మ గుడికి పెయింట్స్ తీసుకురావడానికి ద్విచక్ర వాహనంలో కదిరికి వెళ్లారు. అనంతరం అక్కడి నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. అయితే ఎర్రగుంటపల్లి చెరువు మలుపు వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. అనంతరం కదిరి వైపు నుంచి వస్తున్న కారును కూడా బొలెరో ఢీకొంది. దీంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు కాగా, బొలెరో వాహనం చెరువులోకి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌లో వస్తున్న శ్రీనివాసులరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ షేక్షావలి తెలిపారు.

క్లుప్తంగా

ఆముదం ఆకులు తిని 20 గొర్రెల మృతి

కణేకల్లు: మండలంలోని ఆదిగానిపల్లిలో శుక్రవారం ఆముదం ఆకులు తిని 20 గొర్రెలు మృతి చెందాయి. స్థానికుల వివరాలమేరకు.. గొర్రెల కాపరులైన జడప్పగారి బసవరాజు, హరిజన దుగ్గెన్నలు తమ గొర్రెలను తీసుకొని మేత కోసం పొలాలకెళ్లారు. అయితే గొర్రెలు ఆముదం తోటలో వెళ్లి వాటి ఆకులను తిన్నాయి. దీంతో సాయంత్రం ఒక్కసారిగా గొర్రెల కడుపులు ఉబ్బరమై స్పృహ కోల్పోయి పడిపోయాయి. ఆ తర్వాత మృతి చెందాయి. జడప్పగారి బసవరాజుకు చెందిన 11 గొర్రెలు, దుగ్గెన్నకు చెందిన 9 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఒక్కోదాని విలువ రూ.10 వేలు ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని వెటర్నరీ డాక్టర్ నాగబాబుకు చెప్పడంతో ఆయన సిబ్బందిని ఘటన స్థలానికి పంపారు. మృతి చెందిన గొర్రెలకు శనివారం ఉదయం పోస్టుమార్టం చేయనున్నట్లు డాక్టర్ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం



సమీరా (ఫైల్)

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని నందలపాడుకు చెందిన ఓ విద్యార్థిని అదృశ్యమైనట్లు పట్టణ ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. నందలపాడుకు చెందిన సమీరా (14) ప్రగతి కాన్సెప్ట్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతోంది. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో తల్లి షాకీరాబాను నిద్రలేచి చూడగా కనిపించకపోవడంతో పట్టణ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రామాంజి (ఫైల్)

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి గ్రామానికి చెందిన చిన్నంపల్లి రామాంజి (35) శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు.. రామాంజి తన భార్య మంజమ్మ పిల్లలతో కలిసి జలజీవన్ మిషన్ కింద పైపులైన్ పనులు చేయడానికి కర్ణాటక రాష్ట్రం ఉడిపి జిల్లా కార్‌కల్‌కు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో భోజనం చేసిన తరువాత కుమారులకు బిస్కెట్లు తీసుకురావడానికి దుకాణానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రోడ్డు మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొంది. స్థానికులు చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సలు అందిస్తుండగా రామాంజి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహంపై పడి కన్నీరు మున్నీరయ్యారు. కర్ణాటక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వం.. చిక్కణ్ణేశ్వరుడి రథోత్సవం

కణేకల్లు: అశేష భక్తజనవాహిని నడుమ చిక్కణ్ణేశ్వర స్వామి బ్రహ్మ రథోత్సవం శుక్రవారం నేత్రపర్వంగా సాగింది. వేడుకలను తిలకించేందుకు రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు కర్ణాటకలోని బెంగళూరు, బళ్లారి చెళ్లికెర, మొలకాల్మూరు, చిత్రదుర్గం, రాంపుర తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కణేకల్లుకు తరలివచ్చారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయకమిటీ ధర్మకర్త జే.ప్రసాద్‌రెడ్డితోపాటు భక్తులు పూలతో రథాన్ని అలంకరించారు. సర్పంచ్ నిర్మల, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్ చిత్రదుర్గం నుంచి ప్రత్యేకంగా తయారు చేయించిన భారీ గజలమాలను రథానికి వేసి అలంకరించారు. అనంతరం మత్స్య కార్మికులు కూడా గజమాలను రథానికి వేశారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్‌పర్సన్ కాపు భారతి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్రప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు డి.పద్మావతి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పాటిల్ నాగిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు పైనేటి తిమ్మప్పచౌదరి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డిలు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించారు. సాయంత్రం రథంలో ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చారు. భక్తులు హరహర మహాదేవ శంభోశంకర అంటూ రథాన్ని ముందుకు లాగారు. భక్తులు రథంపై ఖర్జూర పండ్లు విసిరి మొక్కులు తీర్చుకొన్నారు. చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయం నుంచి ఎదురు బసవన్న గుడి వరకు, అక్కడి నుంచి ఈర నాగమ్మ కట్ట వరకు రథం సాగింది. రాయదుర్గం



కణేకల్లులో చిక్కణ్ణేశ్వరస్వామి రథోత్సవ దృశ్యం

రూరల్ సీఐ యుగంధర్, ఎస్ఐ దుగ్గిరెడ్డితోపాటు పలువురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సోమన్న, వైస్ సర్పంచు పెద్దదేవర నబీషా, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, మండల జేసీఎ కన్వీనర్ హనుమంతరావు, మార్కెట్‌యార్డు మాజీ వైస్ ఛైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్కే బద్రీ, వేమన, కెనిగుంట రామిరెడ్డి, గంగలాపురం మత్తు, మారెంపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కాపు భారతి తదితరులు

వైభవంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతులతో ఆలయం చుట్టూ ఊరేగింపు చేస్తున్న భక్తులు

రొళ్ల: రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం కాకి, అప్పేపల్లి, ఆర్.రంగాపురం తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. మహిళలు నియమ నిష్ఠలతో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా జ్యోతులను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా విశేష అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం ఉదయమే అమ్మవారి మూలవిగ్రహంతో పాటు ఉత్సవ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలు, బంగారు, వెండి ఆభరణాలతో పాటు పూలు, గంధంతో అలంకరణ చేసి మహా మంగళారతి ఇచ్చారు. అమ్మవారిని ఇంటి ఇలవేల్పుగా కొలిచే చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో భక్తులు ఉత్సవానికి హాజరై అమ్మవారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు.

పాలబావిలో గంగ పూజ

రొళ్ల మండలం రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయ సమీపంలో ఉన్న పాలబావి దగ్గర గంగ పూజ చేశారు. ఈ క్రమంలో పెళ్లికాని యువతులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు పాలబావిలో గంగ పూజను చేస్తే ఇష్టకార్యం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. మహిళలు బావిలోకి గాజులు, పండ్లు, పూలు, హారతులు ఇతరాత్ర వాటిని నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా దేవాలయం భక్తులతో కిక్కిరిసింది. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

నేడు ఎస్సీ కాలనీ వారిచే ..

రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వారిచే అమ్మవారికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందాం

- విలేకరుల సమావేశంలో మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలతో వైఎస్సార్‌సీపీ పాలనపై ప్రజల్లో బలమైన నమ్మకం ఏర్పడిందన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ప్రతి గడప వద్ద ప్రజలు సాదరంగా ఆహ్వానిస్తున్నారని తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా ప్రజల్లో మమేకమైన పార్టీ నాయకులు, కార్యకర్తలు తిరిగి 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వెళ్లడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.65 కోట్ల ఇళ్లకు పార్టీ సైన్యం వెళ్తోందన్నారు. సుమారు 7 లక్షల మంది పార్టీ సైనికులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్తారని పేర్కొన్నారు. జగనన్న ప్రభుత్వానికి, టీడీపీ ప్రభుత్వానికి తేడాలను పోల్చి వివరిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పథకాలు అందించారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ప్రజా మద్దతు పుస్తకంలో ప్రజల స్పందనను నమోదు చేసుకుంటారన్నారు. ఇంటి యజమాని అంగీకారంతో ఇంటి తలుపుకు, సెల్ ఫోన్లకు మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లు అతికిస్తారని తెలిపారు. ప్రజల మొబైల్ నుంచి 82960 82960 నంబర్‌కి మిస్డ్ కాల్ ద్వారా జగనన్న కీలక సందేశం ప్రజలకు అందిస్తారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పాలనపై ప్రజాభిప్రాయం చేపట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. సమావేశంలో ఎంపీపీ మారుతమ్మ, మార్కెట్ యార్డు ఛైర్ పర్సన్ బిక్కి నాగలక్ష్మి, అర్బన్ సచివాలయ కన్వీనర్ అర్చనలు ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్

హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు సంచాలకులు కామేశ్వరప్రసాద్

ముదిగుబ్బ: హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అదనపు సంచాలకులు డాక్టర్ కామేశ్వరప్రసాద్ వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం ముదిగుబ్బ మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలోని ఐసీటీసీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ప్రతి హెచ్ఐవీ బాధితుడికి హెపటైటిస్ బి సూది మందు మూడు డోసులు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి రాజేంద్ర, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ బషీర్ బాషా, షేర్ ఇండియా ప్రతినిధులు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, నాగార్జున పాల్గొన్నారు.

రియల్ వ్యాపారంలో విభేదాలు.. వ్యక్తిపై దాడి



దాడిలో గాయపడిన సంజీవులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వచ్చిన విభేదాల నేపథ్యంలో ఓ వ్యక్తిపై నలుగురు దాడి చేసిన ఘటన శుక్రవారం స్థానిక కమలానగర్‌లోని ఆర్కే రెస్టారెంట్‌లో చోటు చేసుకుంది. ఈ ఘటనపై బాధితుడు సంజీవులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు సంజీవులు వివరాలమేరకు... గుత్తి పట్టణానికి చెందిన రాణా అనే వ్యక్తికి సంబంధించిన భూమిని గార్లదిన్నె మండలం ముకుందాపురానికి చెందిన సంజీవులు అమ్మించాడు. కాగా భూమి డబుల్ రిజిస్ట్రేషన్ అయింది. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న సంజీవులు..... రాణాతో ఫోన్‌లో విషయం అడిగాడు. ఇలా చేయడం సరైంది కాదని హెచ్చరించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య ఫోన్‌లోనే వాదోపవాదాలు జరిగాయి. కాగా రాణా ఫోన్ చేసి నీతో మాట్లాడాలి... కమలానగరులోని ఆర్కే హోటల్ వద్దకు రమ్మని కబురుపెట్టాడు. సంజీవులు రెస్టారెంట్‌కు వెళ్లి మాట్లాడుతుండగా ఇరువురి మధ్య మరోసారి గొడవ జరిగింది. ఈ క్రమంలో రాణా మగ్గు తీసుకుని సంజీవులుపై దాడి చేయడంతో తలకు తీవ్రమైన గాయమైంది. స్థానికులు సంజీవులును ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా చికిత్స అనంతరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వచ్చిన సంజీవులు తనపై దాడి చేసిన వారిపైన ఫిర్యాదు చేశాడు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని జంగాలపల్లి, చిగిచెర్ల రైల్వేస్టేషన్ మధ్య శుక్రవారం ఉదయం ట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి శవాన్ని కనుగొన్నట్లు రైల్వే ఎస్ఐ గోపీకుమార్ తెలిపారు. సుమారు 35–45 సంవత్సరాల వయసు గల వ్యక్తి ఏదో రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లుగా తెలుస్తోందన్నారు. మృతుడు నీలం రంగు నైట్ ప్యాంట్, లేత నీలి రంగు షర్ట్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతుని ఆచూకీ తెలిస్తే రైల్వే ఎస్ఐ గోపీకుమార్ సెల్ నంబర్: 9440627640కు సమాచారం అందించాలన్నారు.

అవినీతిపై మాట్లాడే అర్హత లోకేష్‌కు లేదు

- గాలిమరల స్కాం సూత్రధారి ఎమ్మెల్యే కేశవే
- ఆరోపణలపై చర్చకు సిద్ధమా?
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్‌రెడ్డి

అనంతపురం క్రైం: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దొడ్డిదారిన మంత్రి అయిన లోకేష్ .. తన మిత్రులు, సూట్‌కేసు కంపెనీలతో కలసి ఏపీ ఫైబర్‌నెట్ స్కాం, తెలంగాణలో ఏపీ డేటా చోరీ చేసిన విషయం రెండు రాష్ట్రాల ప్రజలకు తెలుసు. అలాగే చంద్రబాబు కూడా తెలంగాణలో ఎమ్మెల్సీ కొనుగోలు వ్యవహారంలో అడ్డంగా దొరికాడు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ.వేల కోట్లు అవినీతి పాల్పడి.. ఇవాళ వైఎస్సార్‌సీపీపై, తమపై ఆరోపణలు చేయడమేంటి? లోకేష్ ... నీకు అవినీతిపై మాట్లాడే అర్హతే లేదు' అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ఎల్లారెడ్డి ప్రణయ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుంటే మళ్లీ జిల్లాలో ఫ్యాక్షన్ ఉసిగొల్పేలా లోకేష్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

హెరిటేజ్, ఈనాడుకు గాలిమరలిచ్చింది వాస్తవం కాదా?

ఉరవకొండలో గాలిమరల గురించి మాట్లాడిన లోకేష్.. గత టీడీపీ ప్రభుత్వంలో యాక్సిస్ విండ్ ఎనర్జీ ప్రతినిధులు హెరిటేజ్, ఈనాడుకు ఆరు గాలిమరలు గుడ్‌విల్ కింద ఎందుకిచ్చారో లోకేష్ చెప్పాలన్నారు. సదరు కంపెనీకి మేలు చేశారుకాబట్టే గుడ్‌విల్ కింద ఇచ్చారన్నారు.

ఆరోపణలపై చర్చకు సిద్ధమా కేశవ్?

తనపై చేసిన ఆరోపణలపై లోకేష్ ఎలాగో చర్చకు రాలేడని.. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ చేతనైతే చర్చకు సిద్ధమవ్వాలని, ఉరవకొండ పరిధిలో ఎక్కడైనా సరేనని ప్రణయ్‌రెడ్డి సవాల్ విసిరారు. గాలిమరల్లో తాము అవినీతికి పాల్పడినట్లు లోకేష్ , ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆరోపించడం సిగ్గుచేటన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గాలిమరల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని విమర్శించారు. దానికి ప్రధాన సూత్రధారి కూడా పయ్యావుల కేశవేనన్నారు. వైఎస్సార్ ప్రభుత్వంలో ఒక్క గాలిమర కూడా ఏర్పాటు చేయలేదని స్పష్టం చేశారు. ఊరొదిలి వెళ్లిపోయిన టీడీపీ నాయకులు, దివాళ తీసి రోడ్డెక్కిన టీడీపీ నాయకులు కూడా ప్రభుత్వ భూముల్లో గాలిమరలు ఏర్పాటు చేసి ఆ డబ్బుతో వాహనాలు, దర్జా జీవితాన్ని అనుభవిస్తోంది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. దీని వెనుక ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, ఆయన అన్న పయ్యావుల శీనప్ప ఉన్నారన్నది అందరికీ తెలుసన్నారు. కౌకుంట్లలో కేశవ్ ఇంటికి గ్రీన్ కో కంపెనీ స్లాబ్ వేసిందని, గాలిమరల కంపెనీలు ఇల్లు కట్టించిన వాస్తవం కాదా? అన్నారు. వారి ఇంట్లో ఏ కార్యక్రమం జరిగినా ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ వారు భోజనాలు పెట్టించేవారని, ఆయనా ఇప్పుడు అవినీతి గురించి మాట్లాడేదన్నారు. సమావేశంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, నాయకులు రమేష్, గువ్వల రాజేష్, దేవాంజనేయులు, కొండ, హరీష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ చేసింది వాస్తవం కాదా?

ఎమ్మెల్యే పయ్యావుల అమరావతిలో ఇన్‌సైడ్ ట్రేడింగ్ చేశారని విమర్శించారు. ద్వారకా విలాస్ భూమి యజమాని చంద్రశేఖర్ గుప్తాకు చెందిన లెప్రసీ కాలనీలో పైమాషీ నంబర్ 9 స్త్రోత్రీ భూమి సర్వే నెంబర్ 123లో 5.88 ఎకరాల భూమిని పయ్యావుల శీనప్ప ఫోర్జరీ చేసి వారి అనుచరులు దేవినేని పురుషోత్తం, వజ్రకరూరు కొండయ్య పేరుపై అక్రమ రిజిస్ట్రేషన్ చేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. చేతనైతే తాము ఉరవకొండలో ఎక్కడైనా ఒక్క సెంటు భూమి కబ్జా చేసినట్లు రుజువు చేయాలన్నారు.

'యువగళం'తో జనానికి చుక్కలు !

- సెల్ఫీ కోసం వచ్చిన వారిపై సెక్యూరిటీ సిబ్బంది ప్రతాపం
- మద్యం సేవించి టీడీపీ కార్యకర్తల హల్‌చల్



మద్యం సేవించి రోడ్డుపై హల్‌చల్ చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

శింగనమల/గార్లదిన్నె: నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్రలో పాల్గొనేందుకు వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు చుక్కలు కనిపిస్తున్నాయి. సెల్ఫీల కోసం వచ్చిన వారిపై సెక్యూరిటీ సిబ్బంది ప్రతాపం చూపించడంతో శుక్రవారం చాలా మంది సైడ్ కాలువలు, రోడ్లపై పడిపోయారు.

తల్లీకూతుళ్లను కాపాడిన స్థానికులు..

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర గార్లదిన్నె మండలంలోని మర్తాడు నుంచి శుక్రవారం ప్రారంభమైంది. హిందూపురం బాలకృష్ణ ఉదయమే విడిది కేంద్రం వద్దకు చేరుకోగా అనంతరం లోకేష్‌తో పాటు బాలకృష్ణ కూడా పాదయాత్రలో పాల్గొన్నారు. మర్తాడు హైస్కూల్ సమీపంలోకి రాగానే బాలయ్య, లోకేష్‌లతో సెల్ఫీలు దిగాడానికి మహిళలు, పురుషులు వెళ్లగా సెక్యూరిటీ సిబ్బంది లాగి పక్కకు నెట్టారు. ఈ క్రమంలో తల్లీబిడ్డ కిందకు పడిపోగా జనం వారిని తొక్కారు. చివరికి స్థానికులు తల్లీకూతుళ్లను రక్షించి బయటకు పంపారు. మహిళలకు మాత్రమే సెల్ఫీలు దిగేందుకు అనుమతి ఇచ్చారు.

సైడ్ కాలువలోకి పడిపోయిన జనం..

మర్తాడు బస్టాండ్ సమీపంలో సెల్ఫీలు దిగేందుకు మహిళలు, అభిమానులు వెళ్లగా సెక్యూరిటీ సిబ్బంది వారిని పక్కకు లాగడంతో అక్కడున్న ఫ్లెక్సీ జనం మీదకు పడింది. దీంతో దాదాపు 20 మంది సైడ్ కాలువలోకి పడిపోయారు. మధ్యాహ్నం 12 గంటలకు బాలకృష్ణ హిందూపురానికి వెళ్లిపోగా చాలా మంది అభిమానులు, కార్యకర్తలు కూడా పాదయాత్ర నుంచి జారుకున్నారు. నారా లోకేష్ గార్లదిన్నెకు వెళ్లే సమయంలో తక్కువ జనం మాత్రమే ఆయనతో నడిచారు. హీరో బాలకృష్ణను చూసేందుకే కాస్తో కూస్తో జనం వచ్చారని స్థానిక టీడీపీ నాయకులే చర్చించుకోవడం గమనార్హం. పెనకచెర్లడ్యాం రోడ్డు సర్కిల్ వద్దకు చేరుకున్న అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు భోజన విరామానికి నారా లోకేష్ వెళ్లిపోయారు.

మద్యం సేవించి హల్‌చల్

యువగళం కార్యక్రమానికి వచ్చిన కొంత మంది యువకులు మద్యం సేవించి ద్విచక్ర వాహనాల్లో రోడ్లపై హల్‌చల్ చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పాడింది. దీంతో ఆర్టీసీ బస్సుల్లో ఉన్న ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.

ఆర్థిక మాంద్యం వచ్చే అవకాశం: బాలకృష్ణ

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. నారా లోకేష్ పాదయాత్ర విడిది కేంద్రం వద్ద బాలకృష్ణ విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉచిత పథకాలు వల్ల ఆర్థిక మాంద్యం వచ్చే అవకాశం ఉందన్నారు.

క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

అనంతపురం క్రైం: వివిధ లేఅవుట్‌లలో నిర్మాణ దశలో ఉన్న ఇంటి నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ రమణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థలో హౌసింగ్, తదితర అధికారులకు ఆయన సూచనలు ఇచ్చారు. ఇంకా పనులు ప్రారంభం కాని లే అవుట్‌లలో త్వరితగతిన ప్రారంభించేలా కాంట్రాక్టర్లను ఆదేశించారు.

ఆహారమే ఔషధం



రక్తదానం చేస్తున్న ఫార్మాడీ విద్యార్థులు

అనంతపురం: ఆరోగ్యంలో ప్రధాన పాత్ర పోషించేది ఆహారమే..రోజూ సరైన సమతుల్య ఆహారం తీసుకుంటే ఎలాంటి రోగాలు దరిచేరవని ఓటీపీఆర్‌ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ అన్నారు.శుక్రవారం ఓటీపీఆర్‌ఐలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర జీవన విధానాలను, అలవాట్లను అలవర్చుకోవాలన్నారు.అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఫార్మా డీ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఫార్మాడి విభాగాధిపతి డాక్టర్ ఈ. పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ కామాక్షి అనే మహిళ శుక్రవారం ఉదయం మృతి చెందింది. సరైన వైద్యం అందించకపోవడంతోనే మహిళ మృతిచెందిందని ఆమె బంధువులు ఆందోళన చేశారు. వివరాలు.. ఆత్మకూరు మండలంలోని వై కొత్తపల్లికి చెందిన కామాక్షికి కడుపునొప్పి రావడంతో సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ఆమెను పరీక్షించి, శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని సూచించారు. ఈ నెల 4న సాయంత్రం శస్త్రచికిత్స చేసిన అనంతరం ఆమెను ఎస్‌ఐసీయూలో పర్యవేక్షణలో ఉంచారు. శుక్రవారం తెల్లవారుజామున ఆమెకు ఫిట్స్ వచ్చాయని వైద్యులకు తెలపగా వారు నిర్లక్ష్యం చేశారని, ఉదయం 9.30 గంటలకు ఆమె మృతిచెందిందని బంధువులు వాపోయారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులను సస్పెండ్ చేయాలని కోరుతూ పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. వైద్యాధికారులు వైవీరావు, శౌరి ఆందోళనకారులతో మాట్లాడారు. సంఘటనా స్థలానికి టూటౌన్ పోలీసులు చేరుకొని సర్దిచెప్పినా ఫలితంలేకపోయింది. ఘటనకు సంబంధించి ఆస్పత్రి అధికారులు, పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తి విచారణ చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

గజవాహనంపై కోదండరాముడు



పట్టాభిషేక ఉత్సవాన్ని నిర్వహిస్తోన్న వేదపండితులు

అనంతపురం కల్చరల్: శ్రీరామ నవమి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన శ్రీరామ పట్టాభిషేక వేడుకలు శుక్రవారం సంప్రదాయసిద్ధంగా జరిగాయి. వేదపండితులు కరణం హర్షశర్మ పట్టాభిషేక ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. సీతారాములకు అభిషేక, అలంకార సేవలు జరిగాయి. సాయంత్రం సర్వాంగ సుందరంగా అలంకార భూషితుడైన కోదండ రాముడు నగరవీధుల్లో గజవాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామివారి పల్లకీ సేవ సాగుతున్నప్పుడు భక్తులు ఎదురొచ్చి హారతులు పట్టారు. ఈవో సుధారాణి, ఆలయ కమిటీ సభ్యులు పట్టాభిషేక ఉత్సవంలో పాల్గొన్నారు.

జగనన్న పాలనతోనే బంగారు భవిష్యత్



యువజనకాలనీలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత, జిల్లా అధ్యక్షుడు పైలా , మేయర్ వసీం, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు

- 'జగనన్నే మా భవిష్యత్తు'లో లబ్ధిదారులు
- వాస్తవాలు తెలీకుండా ప్రమాణాలేంటి?
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే మేలు జరిగింది.. వాహనమిత్ర, అమ్మఒడి డబ్బులను పిల్లల భవిష్యత్తుకు వినియోగిస్తున్నాం.. ఇంటి పట్టా ఇచ్చారు.. ఇంతకన్నా ఇంకేం కావాలి? రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే మా మద్దతు అని నవోదయ కాలనీకి చెందిన ఆదవలి (ఆటోడ్రైవర్), షకీల దంపతులు, చెన్నమ్మ, రేణుక, సువర్ణ తదితరులు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో ఆనందాన్ని పంచుకున్నారు. శుక్రవారం నగరంలోని నవోదయ కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్పొరేటర్‌తో కలసి ప్రజామద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలను లబ్ధిదారులకు చదివి వినిపించారు. వారి అభిప్రాయాలను నమోదు చేశారు. అనంతరం వారు జగన్ పాలనపై సంతోషం వ్యక్తం చేయడంతో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. ప్రతి లబ్ధిదారుడి ఇంటి వద్ద 10 నుంచి 15 నిమిషాల పాటు ఎమ్మెల్యే ఉండి ప్రజా మద్దతు పుస్తకంలోని అంశాలను నమోదు చేశారు. దీంతోపాటు వలంటీర్లు, కార్పొరేటర్లు, ప్రభుత్వ పనితీరు ఏవిధంగా ఉంది? సచివాలయ సిబ్బంది సహకరిస్తున్నారా? ఇంకా ఏమైనా మార్పులు కోరుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే 8 మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లారు. గృహసారథులు, వలంటీర్లు, కార్పొరేటర్లు, తదితరులు రోజూ 15 నుంచి 20 ఇళ్లకు వెళ్లి, ఇలా ఈ నెల 20లోపు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ సంపంగి రామాంజనేయులు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, గృహసారథులు మరో 7 ఇళ్లలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మా నమ్మకం నువ్వే జగన్ అనేది ప్రజల నినాదమని, వైఎస్సార్‌సీపీ అందిస్తున్న పథకాలపై ప్రజల్లో సంతృప్తి ఉందని, అందుకే జగనన్నే మా భవిష్యత్తు అని ప్రజలంటున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. అంతకుముందు ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 98 శాతం అమలయ్యాయని, రూ.2 లక్షల కోట్లు పథకాల పేరుతో లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకిరావాలని, జగనన్నే మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు.

నగరంలో... నగరంలోని 1, 20, 50 డివిజన్లలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని కార్పొరేటర్లు లాలూ, లావణ్య, శేఖర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజా మద్దతు పుస్తకంలోని వివిధ ప్రశ్నలకు లబ్ధిదారుల సమాధానం తీసుకుని నమోదు చేశారు. అనంతరం నా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్‌ను లబ్ధిదారుల ఇళ్లకు అతికించారు. ఈ కార్యక్రమంలో గృహసారథులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలు చెప్పకుండా ప్రమాణాలేంటి?

సూపర్ స్పెషాలిటీ, బ్రిడ్జ్ ఫోర్‌వే పనుల జీఓలు చూపిస్తున్నామని, వాస్తవాలు చెప్పకుండా దేవుడు, ప్రమాణాలు అంటూ ప్రజలను పక్కదోవపట్టించడం సరికాదని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిపై ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చురకలంటించారు. మీ పాలనలో ఏమైనా అన్‌రికార్డుగా ఉంటే చూపించాలన్నారు. నాపై చేసిన ఆరోపణలకు స్పందించాల్సిన పనిలేదని, టీడీపీ నేత లోకేష్, ఆయన తండ్రి చంద్రబాబు నాయుడుకి, జిల్లా ప్రజలకు ఎమ్మెల్యే అనంత ఫ్యామిలీ అంటే ఏంటో తెలుసునన్నారు. నిబద్ధత కలిగిన నేతను కాబట్టే ప్రజలు ఐదుసార్లు అవకాశం ఇచ్చారన్నారు. టీడీపీ నేత లోకేష్ స్కాంలలో ఇరుక్కున్నారని, అతను మంచి అనిపించుకునేందుకు ఇతరులపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మేయర్ వసీం, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జోనల్ ఇన్‌చార్జ్‌లు రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, అనుబంధ సంఘాల అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, శ్రీదేవి, కొర్రపాడు హుస్సేన్ పీరా, జీసీఎస్ కన్వీనర్లు చింతాసోమశేఖర్‌రెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, చింతకుంట మధు, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, గౌస్‌బేగ్, కృష్ణవేణి, భారతి, రాధాయాదవ్, శోభారాణి, ఉష, కార్పొరేటర్లు బాలాంజనేయులు, అనిల్‌కుమార్ రెడ్డి, రహంతుల్లా పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే



భోజనాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని ఖాజానగర్‌లోని అల్ హబీబ్ మసీదులో ఆయిల్ బషీర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ మాసం చాలా పవిత్రమైనదన్నారు. ఈ మాసంలో అత్యధికంగా దానధర్మాల ద్వారా అల్లాహ్ కృపను వారు పొందుతారన్నారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కువైట్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సెలవు దినాల్లోనూ ప్రత్యేక కౌంటర్లు

అనంతపురం క్రైం: ఇంటి పన్ను చెల్లించేందుకు సెలవు దినాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ రమణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడాదికి సంబంధించిన పన్ను ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. నగరపాలక సంస్థలో, పాతూరు కూరగాయల మార్కెట్ పక్కన 17వ వార్డు సచివాలయం, రాంనగర్ మీ సేవ పక్కన ఉన్న 54 సచివాలయం, రెండవరోడ్డు స్టడీ పార్క్ పక్కన 64వ వార్డు సచివాలయం, నవోదయ కాలనీ రోడ్డులోని 41వ వార్డు సచివాలయాల్లో పన్ను చెల్లించే సదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు. నెట్ బ్యాంకింగ్, చెక్కులు తీసుకోనున్నట్లు తెలిపారు.

సీమలో రాజధాని, హైకోర్టు ఏర్పాటు చేయాలి

అనంతపురం: రాయలసీమలో రాజధాని, హైకోర్టును తక్షణం ఏర్పాటు చేయాలని రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి, 2020లో అసెంబ్లీ సాక్షిగా మూడు రాజధానుల చట్టం నిర్ణయాన్ని తక్షణం అమలు చేయాలని కోరారు. అనంతపురంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నట్లే.. రాయలసీమలోనూ మినీ సెక్రటేరియట్, ఒక సెక్షన్ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలన్నారు. శ్రీభాగ్, శ్రీకృష్ణ కమిటీ, శివరామన్ కమిటీ, జీఎస్ రావు కమిటీ, బోస్టన్ కన్సెల్టెన్సీలు వికేంద్రీకరణ విషయమై పేర్కొన్న సూచనలు పరిగణలోకి తీసుకుని అమలు చేయాలన్నారు. గుంతకల్లులో ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాయలసీమ విమోచన సమితి నాయకులు రాజశేఖర్ రెడ్డి, కాసిరావు, జ్ఞానేశ్వర్ రెడ్డి, కోటేశ్వరరావు, గురుశంకర్, సీతారాం రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి

ఐఎంఏ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఉమెన్ వింగ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఐఎంఏ ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ మేయర్ కోగటం , ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసులు, ఐఎంఏ ఉమెన్ వింగ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ హేమలత, డాక్టర్ ప్రసూన, అమర్‌నాథ్‌రెడ్డిలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ముందుగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐఎంఏ హాల్ నుంచి కోర్టు రోడ్డు, టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, తెలుగుతల్లి విగ్రహం మీదుగా ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ ఉమెన్ వింగ్ ప్రతినిధులు డాక్టర్ సుమన గోపిచంద్, డాక్టర్ సుప్రజా చౌదరి, ప్రముఖ సైకియాట్రిక్ వైద్యులు డాక్టర్ యండ్లూరి ప్రభాకర్, ఐఎంఏ జిల్లా కార్యదర్శి డాక్టర్ అభిషేక్ రెడ్డి, డాక్టర్ బాలాకుమారి, ప్రత్యూష, శంకర్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న డాక్టర్ యండ్లూరి ప్రభాకర్

ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

- జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ యుగంధర్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఉద్యోగులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఇన్‌చార్జ్ వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యుగంధర్ సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి తెలుగుతల్లి విగ్రహం మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది మానవహారంగా ఏర్పడి పెద్ద ఎత్తున ఆరోగ్య పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్థానిక కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థను స్థాపించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సిబ్బంది పర్వీన్, షఫి, వేణుగోపాల్, కిరణ్, నూర్‌బాషా, మద్దయ్య పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు దయాకర్, సబిహా సుల్తానా పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వడ్డుపల్లిలో ర్యాలీ నిర్వహించారు. కేన్సర్‌పై సర్వే చేసి, ఉచితంగా మందులు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో పర్యటించి, సర్వే చేశారు. కార్యకర్మంలో వైద్య సిబ్బంది నాగేశ్వరయ్య, వెంకటరత్నమ్మ, లక్ష్మి, తేజశ్వని తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నోటా 'జగనన్నే మా భవిష్యత్'

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- పాపంపేటలో 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రారంభం



రాప్తాడులో స్టిక్కర్లు విడుదల చేస్తున్న దృశ్యం



ఇంటికి స్టిక్కరు అతికిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి



ఆత్మకూరులో స్టిక్కర్లు విడుదల చేస్తున్న నాయకులు

రాప్తాడురూరల్: ప్రజలు ఏ ఇంటికెళ్లినా జగనన్నే మా భవిష్యత్ అంటున్నారు అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలిసి 'జగనన్నే మా భవిష్యత్తు', 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల వారిని బతికించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రతి గడపకూ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. చిత్తశుద్ధి కలిగిన నాయకుడు, మానవతావాది ముఖ్యమంత్రి అయితేనే ఇవన్నీ సాధ్యమయ్యాయన్నారు. వలంటీర్ల సహకారంతో సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిపై వివరించాలన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల తాలూకా వడ్డీలు ఏ విధంగా చెల్లిస్తున్నారో తెలియజేయాలన్నారు. టీడీపీ హయాంలో ఆదాయం అంతా పెత్తందారులు, బడాబాబుల చేతుల్లోకి ఎందుకు వెళ్లిపోయిందో తెలియజేస్తామన్నారు. పేరూరు డ్యాంకు నీళ్లు తెచ్చామని, రూ. 110 కోట్లతో తాగునీటి పథకాలు మంజూరు చేయించామన్నారు. 25 వేలకు పైగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. తన సొంత నిధులతో డెయిరీ నిర్మిస్తున్నామని, పేద రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తున్నామన్నారు. అనంతరం పలు ఇళ్లకు తిరిగిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఇళ్లకు స్వయంగా స్టిక్కర్లు అతికించారు.

చంద్రబాబు, పచ్చమీడియాదుష్ప్రచారం..

జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ అన్ని వర్గాలకు మేలు చేస్తున్న ప్రభుత్వంపై చంద్రబాబు, పచ్చమీడియా దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. ఎస్సీలకు పథకాలు ఇస్తుంటే టీడీపీ వాళ్లు ఓర్వలేకపోతున్నారన్నారు. బీసీలకు పథకాలు, పదవులు ఇస్తుంటే ఓర్చడం లేదన్నారు. భవిష్యత్తులో బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీకు మరింత మేలు జరుగుతుందనే భయంతోనే దుష్ప్రచారానికి తెర లేపారన్నారు. పైలా నరసింహయ్య మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుజ్జల వరలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, నాయకులు ధనుంజయ యాదవ్, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఓబుగారి హరినాథరెడ్డి, మండల ఇన్‌చార్జ్ మఠం శ్యాంసుందర్, పార్టీ మండల కన్వీనర్లు పవన్, గోవిందరెడ్డి, పంచాయతీ కన్వీనర్ మాదన్న, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, మౌనిక, సందీప్‌యాదవ్, వడ్డే శీనా, యూత్ విభాగం మండల కన్వీనర్ శ్రీనివాసులు, సచివాలయ కన్వీనర్లు అపర్ణ, టి.గోపాల్‌రెడ్డి, కె.గోపాల్‌రెడ్డి, గృహసారథులు, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో కార్యక్రమాలను చేపట్టారు. ప్రతి ఇంటికీ తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, వెంకట్రాముడు, ఫణిరెడ్డి, అంజినప్ప, బుసిరెడ్డి, కేశవరెడ్డి, నాగరాజు, లక్ష్మీనరసింహులు, దామోదర్ పాల్గొన్నారు.

రాప్తాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం చేపట్టామని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మీ అన్నారు. శుక్రవారం 'జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని మండలవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామా గ్రామాన అట్టహాసంగా ప్రారంభించారు.ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మీ, మరూరు జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మారూరు సొసైటీ అధ్యక్షుడు మాచిరెడ్డి కొండా రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణస్వామి, మాజీ ఎంపీటీసీ సభ్యులు వెల్పుల రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ గవ్వల పరంధామ, వైఎస్సార్ సీపీ నాయకులు రవి కుమార్, సాకే చంద్ర, జయన్న, మాచిరెడ్డి చెన్నా రెడ్డి, నరసింహ రెడ్డి, చిరుతల నాగేంద్ర, కపాడం ఈశ్వరయ్య, డొక్కా రామచంద్ర, డొక్కా విజయశంకర్, భాస్కర్ రెడ్డి, మహిళ నాయకురాలు ఉషా రాణి పాల్గొన్నారు.

ఆత్మకూరు: అడిగిన వెంటనే పథకాలు అందిస్తున్నారు.. మా ఇంటికి దేవుడిలా వచ్చావన్నా.. అంటూ ఆత్మకూరుకు చెందిన దొడగొట్ట రాయమ్మ అనే మహిళ ఆనందంగా చెప్పింది. శుక్రవారం గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆత్మకూరుకు చెందిన రాయమ్మ అనే మహిళ గృహసారథులు ఇంటికి అతికించిన జగనన్న మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లకు హారతిపట్టి, తన అభిమానాన్ని చాటుకుంది.

వైఎస్సార్‌సీపీలో పది కుటుంబాల చేరిక

రామగిరి: మాజీ మంత్రి పరిటాల సునీత సొంత గ్రామమైన వెంకటాపురానికి కూతవేటు దూరంలోని కొత్తగ్యాదికుంటలో పది దళిత కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామానికి చెందిన మిద్దె నరసమ్మ, వరలక్ష్మి, ముత్యాలక్క, కుళ్లాయమ్మ, పెద్దక్క, సిరిపాకుల లక్ష్మి, సాలక్క, నరసింహమూర్తి, చంద్రయ్య, ముత్యాలయ్య తదితర కుటుంబాలు ఎంఎల్‌ఏ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో అనంతపురంలో పార్టీలోకి చేరాయి. వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా టీడీపీకోసం కష్టపడినా తగిన ప్రాధాన్యత లేదన్నారు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు నచ్చి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్, ముత్యాలమ్మ ఆలయకమిటీ చైర్మన్ కురుబ ముత్యాలప్ప, సింగిల్‌విండో ప్రెసిడెంట్ ముత్యాలు, నాయకులు జేష్ఠ్యరామయ్య, బోయనాగేంద్ర, బండారు అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ కార్యకర్తలు

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. నగరంలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు ఉద్యోగులకు నెలకు రూ.20 వేలు ఇస్తామని వర్సిటీ ఉన్నతాధికారులు ప్రకటించారు. అయితే పాలకమండలి ఆమోదం పొందలేదని జీతం రూ.16 వేలకు కుదించినట్లు పేర్కొన్నారు. గత 22 సంవత్సరాలుగా వర్సిటీలో చాలీచాలని వేతనంతో పనిచేస్తున్నామని, తమకు న్యాయం చేయాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులు ఎవరైనా చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అవసరమైతే సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మల్లిరెడ్డి, జనరల్ సెక్రటరీ మంజునాథ్ నాయక్,హాస్టల్ ఎంప్లాయిస్ పాల్గొన్నారు.

ప్రేమకు ప్రతిరూపం యేసుక్రీస్తు



ఎస్‌ఐయూ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పి.యాలేరులో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

అనంతపురం కల్చరల్: జిల్లా వ్యాప్తంగా గుడ్‌ఫ్రైడేను ఘనంగా జరిగాయి. ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు అసంఖ్యాకంగా తరలివచ్చి, ప్రత్యేక ఆరాధనలో పాల్గొన్నారు. పలు చోట్ల భక్తిగీతాల ఆలాపనలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని రామచంద్రానగర్‌లో క్రీస్తు జీవితాన్ని నాటిక రూపంలో ప్రదర్శించారు. ఎస్‌ఐయూ చర్చిలో రెవరెండ్ సంపత్‌కుమార్, రెవరెండ్ పి.జార్జి దైవపరిచర్య చేశారు. భక్తులకు సునీల్, రాజు, అనిల్ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అరవిందనగర్‌లోని సీఎస్‌ఐ చర్చిలో ముఖ్య ప్రసంగీకులుగా రెవరెండ్ డాక్టర్ ఎస్వీ గ్రేస్‌భాను క్రీస్తు జీవిత ఘట్టాలను వివరించారు. పాస్టర్ బెన్‌హర్‌బాబు ఉపోద్ఘాత సందేశంతో పాటు సామూహిక ప్రార్థనలు చేయించారు. జీసెస్ కంపాషన్ చర్చిలో పాస్టర్ల సంఘం అధ్యక్షుడు రెవరెండ్ మోజెస్ అనిల్‌కుమార్ వాక్యపరిచర్యలో గుడ్‌ఫ్రైడే నాడు క్రీస్తు పలికిన ఏడు మాటలను వివరించారు. క్రీస్తు విశ్వాసుల సంఘంలో నతేనియల్, రెవరెండ్ జయరామ్, కళాకారుల కాలనీలోని రేమా చర్చిలో పాస్టర్ మనుష్షే, హెర్మోన్ చర్చిలో పాస్టర్ ఐజయ్య సందేశాలను వినిపించారు. ఐసీసీ అధ్యక్షుడు ఆనంద్ వారి సంఘ కార్యాలయంలో వారు మాట్లాడుతూ శనివారం ఉదయం రన్ ఫర్ జీసెస్ ఉంటుందన్నారు.

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా శుక్రవారం గుడ్‌ఫ్రైడే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆత్మకూరు, పి. యాలేరు, సనప, పంపనూరు గ్రామాల్లో పెద్ద ఎత్తున గుడ్‌ఫ్రైడే నిర్వహించారు. పి.యాలేరులో గ్రామంలో ఉదయాన్నే భక్తులు సిలువ మోస్తూ ఏసు ప్రభువు గీతాలు ఆలపిస్తూ ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చిలోకి వెళ్లి ప్రార్థనలు చేశారు.

రాప్తాడు: మండలంలోని పుణ్యక్షేత్రం చర్చి, చిన్మయనగర్‌లోని ఎస్‌ఎఫ్‌ఎస్ చర్చి విచారణ గురువులు లూయిస్ ఫాదర్, ఫాదర్ విజయ్ కుమార్, డాన్ బోస్కో పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ రజిని అన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా క్రైస్తవులు గుడ్ ఫ్రైడే నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్లు, సంఘ పెద్దలు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఐయూ చర్చిలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న కేజే ప్రభాకర్ కుటుంబ సభ్యులు



రాప్తాడులో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు